సాక్షి
గుంటూరు
శనివారం : 24 : మే : 2025



ముగిసిన సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధృవపత్రాల పునఃపరిశీలనకు తెనాలిలోని జిల్లా వైద్యశాలలో ఏర్పాటైన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను శుక్రవారం భక్తులు భారీగా దర్శించుకున్నారు. లక్ష కుంకుమార్చనలో ఆలయ ఈఓ శీనా నాయక్ దంపతులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కరోనా అలెర్ట్

-ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
-డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



గుంటూరు మెడికల్ : నూతనంగా కరోనా వైరస్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా సాధ్యమైనంత మేరకు ఇళ్లల్లోనే ఉండాలి. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. బయటకు వచ్చే వారు తప్పనిసరిగా మాస్క్ ధరించండి. జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో, మార్కెట్, బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర ప్రదేశాల్లోకి వెళ్లకుండా దూరంగా ఉండండి. ఏదైనా అనుమానం ఉంటే గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కరోనా పరీక్షలు చేయించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానంకు బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం అద్దేపల్లి గ్రామ వాస్తవ్యుడు పానుగంటి జయ నటరాజ్‌కుమార్, లక్ష్మీదివ్య దంపతుల కుమారుడు షత్విక్ జయదేవ్ పేరున రూ.1,00,001 విరాళంగా శుక్రవారం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందించారు. దాతలు తొలుత స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నేడు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక పీజీఆర్ఎస్

నరసరావుపేట: ప్రతి నెలా నాలుగో శనివారం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఆర్టీసీ స్థలాల అద్దె వ్యవహారంపై సమావేశం



నరసరావుపేట: సత్తెనపల్లి, నరసరావుపేట, పిడుగురాళ్లలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను 15 ఏళ్లపాటు చట్టపరమైన వ్యాపారం చేసుకునేందుకు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో శుక్రవారం ఆర్టీసీ డిపోలోని ప్రజా జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నెల్లూరు జోనల్ కార్యాలయం ద్వారా టెండర్లు పిలవనున్నారని పీటీడీ జిల్లా అధికారి ఎం.మధు పేర్కొన్నారు. ఇవ్వబోయే స్థలాలను గురించి పారిశ్రామిక వేత్తలతో చర్చించారు.

వైభవంగా ఆంజనేయుని రథోత్సవం

వేమూరు: మండలంలోని జంపని గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల హనుమ నామస్మరణ, మేళతాళాల మధ్య వేడుక సాగింది. కోలాటం, భజనల నడుమ రథోత్సవం జరిగింది. భక్తులు షేక్ అబ్దుల్ కలాం ఆజాద్ దంపతులు వార్షిక పూజాకర్తలుగా వ్యవహరించారు. పెరుమాళ్ల వెంకట సుబ్బయ్య, పెరుమాళ్ళ రామయ్య నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో గొంది శివరామ కృష్ణ ప్రసాద్, మన్నే శివ వెంకటేశ్వరరావులు ప్రసాద పంపిణీ చేశారు. ఆంజనేయ భక్త బృందం, సీతారామాంజనేయ భజన సమాజం, ఆంజనేయ యువజన భక్త సమాజం, వీరాంజనేయ కోలాట భజన సమాజం సభ్యులు పాల్గొన్నారు.

తెల్లబోయిన బర్లీ రైతు

ప్రత్తిపాడుకు చెందిన ఓ రైతు ఈ ఏడాది సుమారు నాలుగు ఎకరాల్లో నల్లబర్లీ పొగాకు సాగు చేశాడు. సుమారు పదకొండు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అమ్ముకుందామని ఓ కంపెనీని ఆశ్రయించాడు. క్వింటా ఆరు, ఏడు వేలు చెప్పారు. అది కూడా మూడు, నాలుగు క్వింటాళ్లే కొంటామన్నారు. మిగిలిన పంట రెండు, మూడు వేలకు కొంటామని చెప్పారు. దిక్కుతోచని పరిస్థితుల్లో వచ్చిన కాడికి అమ్ముకుని కన్నీటితో ఇంటిబాట పట్టాడు. ఇది ఈ ఒక్కరైతు పరిస్థితే కాదు. నల్లబర్లీ సాగు చేసిన ఎందరో రైతుల కన్నీటి వ్యథ..

- గత ఏడాది ఆశాజనకంగా నల్ల బర్లీ పొగాకు ధరలు
- ఈ ఏడాది ప్రత్తిపాడు ప్రాంతంలో అధికంగా సాగు
- దిగుబడులు వచ్చే సమయానికి ధరలు పతనం
- కొనుగోలుకు ముందుకురాని పొగాకు కంపెనీలు
- ఆదుకోని ప్రభుత్వం.. ఆందోళనలో సాగుదారులు



ప్రత్తిపాడులోని గోడౌన్‌లో నిల్వ చేసిన నల్లబర్లీ పొగాకు బేళ్లు

ప్రత్తిపాడు: ఈ ఏడాది నల్ల బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు నిండా మునిగిపోతున్నారు. గిట్టుబాటు ధర లేక, కొనే నాథుడు కానరాక అల్లాడిపోతున్నారు. వీటికి తోడు అకాల వర్షంతో అవస్థ పడుతున్నారు. ఆదుకునేందుకు ముందుకు రావాల్సిన కూటమి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ప్రత్తిపాడు మండలంలో 1,425 ఎకరాల్లో, పెదనందిపాడు మండలంలో 5,500 ఎకరాల్లో, కాకుమాను మండలంలో 1,333 ఎకరాల్లో, వట్టిచెరుకూరు మండలంలో 126 ఎకరాల్లో రైతులు నల్ల బర్లీ సాగు చేశారు.

గత ఏడాది ధర బాగుండటంతో..

గత ఏడాది నల్ల బర్లీ పొగాకు ధర సుమారు పదిహేను వేలనుంచి ఇరవై వేల రూపాయల వరకు నాణ్యతను బట్టి పలికింది. కంపెనీలు, వ్యాపారులు రైతుల వద్దకే వచ్చి కొన్నారు. ఈ ఏడాది మిర్చి, పత్తి బదులు అధిక శాతం రైతులు నల్ల బర్లీ సాగు చేశారు. తీరా దిగుబడి వచ్చే సమయానికి ధర పతనం అయ్యింది. ప్రస్తుతం ఏడు, ఎనిమిది వేలకు కూడా కొనేవారు లేరు. దీంతో బర్లీని నమ్ముకుని బొక్క బోర్లా పడ్డామని రైతులు నెత్తీ నోరూ బాదుకుంటున్నారు.

పెట్టుబడులు పెరిగి.. దిగుబడులూ తగ్గి..

నల్ల బర్లీకి పెట్టుబడులు కూడా ఎక్కువగానే పెట్టాల్సి వచ్చింది. ఎకరాకు కౌలుతో కలిపి సుమారు లక్షా ఇరవై వేల నుంచి 1.50 లక్షల రూపాయల వరకూ అయ్యింది. వాతావరణం కూడా అనుకూలించక పోవడం, ప్రతికూల పరిస్థితులు ఎదురవడంతో దిగుబడులు తగ్గిపోయాయి. ఎకరాకు పది నుంచి పన్నెండు క్వింటాలు మాత్రమే వచ్చాయి. ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండటంతో దిగుబడులు తడిసిపోతున్నాయి. ధర లేక పోవడంతో పొగాకు బేళ్లను స్థానికంగా ఉన్న గోడౌన్లలో నిల్వ చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల వానకు తడిసి ముద్దవుతుంది. మరోవైపు ఓ కంపెనీ రైతుల దైన్య స్థితిని క్యాష్ చేసుకుంటుంది. ఆరు వేలు ధర ఉన్నప్పటికీ కేవలం రెండు మూడు వేలకు కొనుగోలు చేస్తుంది.

కొనే వారు లేరు



నాలుగు ఎకరాల్లో నల్ల బర్లీ సాగు చేశాను. ఎకరానికి లక్షా ఇరవై వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టా. ఇప్పుడు రేటు చూస్తే పూర్తిగా పతనమయ్యింది. ఉన్న ధరకు అమ్మేసుకుందామనుకున్నా కొనే వారు లేరు. ప్రభుత్వం నల్లబర్లీ రైతులను ఆదుకోవాలి.

– చాగంరెడ్డి అనిల్‌కుమార్ రెడ్డి, పొగాకు రైతు, ప్రత్తిపాడు.

రూ. 2 వేలకు అమ్ముకున్నాను



నల్ల బరీ రైతుల నుంచి పొగాకు కొంటున్నది ప్రస్తుతం ఒక్క కంపెనీనే. అది కూడా వాళ్ల ఇష్టం. నచ్చితే కొంటున్నారు. లేదంటే లేదు. అందుకే ప్రైవేట్ వ్యక్తులకు పొగాకును రూ. 2 వేలకే అమ్ముకున్నాను. ప్రభుత్వం నల్ల బర్లీ సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– బాపతు చెన్నారెడ్డి, పొగాకు రైతు, ప్రత్తిపాడు



తడిసిన పొగాకును సరి చేసుకుంటున్న రైతు

రేషన్ కార్డ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



రేషన్ కార్డు కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న ఎ.భార్గవ్ తేజ

నెహ్రూనగర్: జిల్లాలో రైస్ కార్డులకు సంబంధించి నూతన కార్డుల మంజూరు, చిరునామా మార్పు, కుటుంబ సభ్యుల చేర్పు, విభజన, తొలగింపు, సరెండర్, అప్‌డేషన్ వంటి సర్వీసుల దరఖాస్తులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని గోరంట్ల 183వ వార్డు సచివాలయంలో రైస్ కార్డు దరఖాస్తుల సర్వీసులను పరిష్కరిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. రైస్ కార్డు మాడ్యూవల్‌లో నమోదు చేసే విధానాన్ని డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ కంప్యూటరులో పరిశీలించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వెంటనే సంబంధిత కుటుంబ సభ్యుల ఈకేవైసీ చేసి, క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రముని, తూర్పు మండల తహసీల్దారు సుభాని, సివిల్ సప్లయిస్ డీటీ భాస్కర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించండి

గుంటూరు వెస్ట్: ఆర్థిక ప్రగతి, ఉపాధి కల్పనకు పరిశ్రమల ఏర్పాటు అవసరమని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారిని ప్రోత్సహించాలన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో క్రీడా రత్నం

- జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటుతున్న నాగం జ్ఞానదివ్య
- సొంతూరు కవెవరంలో సాధన
- ప్రభుత్వ పాఠశాల పీఈటీచే శిక్షణ
- కామన్‌వెల్త్ పోటీల్లోనూ ఆరు పతకాలు



ఆసియా పోటీల్లో సాధించిన పతకాలు, జ్ఞాపికలతో నాగం జ్ఞానదివ్య

తెనాలి: పట్టణాలు, నగరాల్లో జిమ్‌లు, క్రీడా అకాడమీలు క్రీడాభిరుచి కలిగిన యువతకు అందుబాటులో ఉంటున్నాయి. ఎందరో యువతీ యువకులు వాటిని అందిపుచ్చుకుని క్రీడారంగంలో పోటీ పడుతున్నారు. పతకాలను సాధిస్తూ ప్రభుత్వ ఉద్యోగాలను పొందుతున్నారు. గ్రామాల్లోనూ ఆ సౌకర్యాలు ఏర్పాటైతే అక్కడ నుంచి కూడా క్రీడారత్నాలు వెలుగులోకి వస్తాయి. పట్టణ యువతతో పోటీపడి విజయాలు సాధిస్తారు. ఇటీవల ఆసియా క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్, యూనివర్శిటీ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్–2025లో మొత్తం 8 పతకాలను సాధించిన పవర్‌లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య ఇందుకో నిదర్శనం.

ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగిన ఆసియా క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్‌లో రెండు రజత పతకాలు, రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకున్న జ్ఞానదివ్య, యూనివర్శిటీ క్లాసిక్ పోటీల్లో నాలుగు స్వర్ణ పతకాలను సాధించింది. ఆసియా సెకండ్ బెస్ట్ లిఫ్టర్ అవార్డును స్వీకరించింది. 2021లో పవర్‌లిఫ్టింగ్‌లో సాధన ఆరంభించిన జ్ఞానదివ్య రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో వరుసగా పాల్గొంటూ అవలీలగా పతకాలను సాధిస్తోంది. కామన్ వెల్త్, వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ పాల్గొని విజయాలను అందుకుంటున్న జ్ఞానదివ్య గ్రామీణ ప్రాంత క్రీడారత్నం. ప్రస్తుతం కేఎల్ యూనివర్శిటీలో బీసీఏ సెకండియర్ పూర్తిచేసింది.

కాకతాళీయంగా సాధన

తెనాలి రూరల్ మండలం గ్రామం కవెవరం ఆమె సొంతూరు. సుధారాణి, వెంకటేశ్వరావు తల్లిదండ్రులు. పవర్‌లిఫ్టింగ్‌లో సాధన కాకతాళీయంగా జరిగింది. ఇంటర్మీడియెట్ చదువుతుండగా గ్రామంలో మాతృశ్రీ అకాడెమీ ఏర్పాటైంది. వాస్తవానికి కవెవరం గ్రామం ఒకప్పుడు అథ్లెటిక్స్‌కు కేంద్రం, ఇక్కడ్నుంచి తయారైన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తలపడ్డారు. గ్రామం నుంచి వెయిట్‌లిఫ్టర్లను తయారు చేయాలనే సంకల్పంతో ఇక్కడ అకాడమీ ఏర్పాటైంది. క్రీడాభిలాష కలిగిన వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో జ్ఞానదివ్య అకాడమీలో చేరింది. వెంకటేశ్వరరావు, వలి, సుధాకర్, రామిరెడ్డి, వీరారెడ్డి శిక్షణతో వెయిట్‌లిఫ్టింగ్ శిక్షణ ఆరంభించింది. కొద్దిరోజుల తర్వాత పవర్‌లిఫ్టింగ్‌కు మారింది. నందివెలుగు జడ్పీ హైస్కూలు పీఈటీ కొల్లిపర నాగశిరీష శిక్షణలో క్రమం తప్పక సాధన చేస్తూ, 2021 ఆఖర్నుంచి పోటీల్లో పాల్గొంటూ వచ్చింది. సబ్‌జూనియర్స్‌లో 84 పైగా కిలోల కేటగిరీలో తలపడుతున్న జ్ఞానదివ్య, కేవలం తొమ్మిది నెలల వ్యవధిలో రాష్ట్ర, జాతీయస్థాయిలో మూడేసి స్వర్ణాలు, దక్షిణభారత పోటీల్లో రజత పతకాన్ని గెలిచింది.



నాగం జ్ఞాన దివ్యను అభినందిస్తున్న కేఎల్‌యూ యాజమాన్యం

అంతులేని ఆత్మవిశ్వాసంతో పతకాల వేట

2022లో కేరళలో జరిగిన జాతీయ పోటీల్లో జ్ఞానదివ్య, మూడు బంగారు పతకాలను సాధించటమే కాకుండా, స్క్వాట్, డెడ్‌లిఫ్ట్‌లో అంతకుముందున్న రికార్డులను చెరిపేసి కొత్త రికార్డులను సృష్టించింది. టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో జరిగిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఆ పోటీల్లో రెండు కాంస్య పతకాలను దక్కించుకుంది. 2022లో న్యూజిలాండ్‌లో జరిగిన కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 3 స్వర్ణాలు, ఒక రజతం నెగ్గింది. 2023లో కేరళలో జరిగిన ఆసియా క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు రజత పతకాలను అందుకుంది. గతేడాది సౌతాఫ్రికాలోని సన్‌సిటీలో నిర్వహించిన కామన్‌వెల్త్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ నాలుగు కాంస్యాలను కైవసం చేసుకుంది. ఏ పోటీలో తలపడినా పతకం మాత్రం ఖాయమంటున్న జ్ఞానదివ్య, లక్ష్యం మాత్రం అంతర్జాతీయంగా మరింత గుర్తింపును తెచ్చుకోవటం, క్రీడల కోటాలో రైల్వేశాఖలో ఉద్యోగం సాధించటమేనంటుంది.

కదం తొక్కిన ఎండీయూ వాహనదారులు

- కూటమి ప్రభుత్వ కుట్రపై పోరుబాట
- సర్కారు నమ్మించి మోసం చేసిందని ఆవేదన
- తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్



నిరసన తెలుపుతున్న వాహనదారులను అడ్డుకుంటున్న పోలీసులు

గుంటూరు వెస్ట్: ఉపాధికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తమకు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు మోసం చేయడం దారుణమని ఎండీయూ వాహనదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక స్తంభాలగరువు నుంచి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా అర్ధనగ్నంగా ఎండీయూ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాషా మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సంఘం రాష్ట్ర నాయకులు కలిసినప్పుడు ఉపాధికి ఎటువంటి ఇబ్బంది ఉండదని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ ఇంతలోనే ఆ మాట తప్పారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యి కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. వాస్తవానికి తమ కాంట్రాక్ట్ 2027 జనవరి వరకు ఉందని, అప్పటి వరకు తమను కొనసాగించాలన్నారు. ప్రజాదరణ పొందిన ఎండీయూ వాహనాల వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీని తొలగించడానికి ఎటువంటి కారణాలు లేవన్నారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలకు సేవ చేయడమే కర్తవ్యంగా భావిస్తామని చెప్పారు. ఉపాధి మార్గాలు చూపించాల్సిన ప్రభుత్వం ఇలా తమ నోటి దగ్గర కూడు లాగేయడం అన్యాయమని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు మరే పని చేతకాదని, కనీసం రెండేళ్ల సమయం ఇస్తే ఇతర మార్గాలు అన్వేషించుకుంటామని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు కె.డానీ, బి.తిరుపతి రామయ్య పాల్గొన్నారు. వాహనదారులకు ఆదిలోనే పోలీసుల నుంచి ఇబ్బందులు ఎదురయ్యాయి. సుమారు 20 మంది పోలీసులు వచ్చి కదలనీయలేదు. స్తంభాలగరువులోనే అసోసియేషన్ నాయకులు ప్రసంగించి, కార్యక్రమాన్ని ముగించారు. తమను పోలీసులు అడ్డుకోవడం దారుణమని వాపోయారు.

మద్యం దుకాణాలు సమయపాలన పాటించాల్సిందే

- వైన్ షాపులు రాత్రి 10 గంటలకు మూసేలా ఎక్సైజ్ సిబ్బంది పర్యవేక్షణ
- అనధికార పర్మిట్ రూమ్‌లు నిర్వహించే వారిపై కఠిన చర్యలు
- విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్



మాట్లాడుతున్న డాక్టర్ కె.శ్రీనివాస్

నెహ్రూనగర్: గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని బార్ అండ్ రెస్టారెంట్‌లు, వైన్ షాపులు తప్పనిసరిగా సమయపాలన పాటించాల్సిందేనని ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని మద్యం షాపులు రాత్రి 10 గంటలకు కచ్చితంగా మూసేయాల్సిందేనన్నారు. 10 గంటలకు వైన్ షాపులను మూసేలా ఎక్సైజ్ సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. పర్మిట్ రూములు నిర్వహణకు అనుమతి లేదని, ఎవరైనా పర్మిట్ రూములల్లో మద్యం తాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌లు కూడా రాత్రి 11 గంటల వరకు లిక్కర్ సరఫరా, ఆ తరువాత గంట వరకు ఫుడ్ సరఫరాకు అనుమతి ఉందని చెప్పారు. అనంతరం తప్పనిసరిగా మూసివేయాల్సిందేనన్నారు. సమయ పాలనపై ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ప్రత్యేక బృందాలు పర్యవేక్షణ చేస్తాయని తెలిపారు. వీరిపై ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌ల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించే షాపుల లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత సంవత్సరం అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు మొత్తం 1,900 కేసులు నమోదు చేసి 1,201 మందిని అరెస్టు చేశామన్నారు. ఇందులో మద్యం 2,297 లీటర్లు, బీరు 119 లీటర్లు, నాటు సారా 444 లీటర్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయి 2.89 గ్రాములు, కొకైన్ 8.5 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి మొత్తం 21 వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇ. మారయ్యబాబు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 3,800

మోడల్ ధర రూ. 3,000



పసుపు ధరలు

(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1326

కొమ్ములు : 994 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,050	10,975	10,600

కాయలు : 332 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,050	10,975	10,600

మొత్తం అమ్మకాలు : 994.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ మృతి



కాకుమాను: రోడ్డు ప్రమాదంలో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పెదనందిపాడు ఎస్‌ఐ పవన్ మధు కథనం ప్రకారం బాపట్ల జిల్లాలో కీర్తి వెంకటరాజు ఇంటెలిజెన్స్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అయితే తన స్నేహితుడు గుప్తాతో కలిసి గుంటూరు వెళ్లి తిరుగు ప్రయాణంలో పెదనందిపాడు శివారులో కారు చెట్టుని బలంగా ఢీ కొట్టడంతో వెంకటరాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కారులో ఉన్న తన స్నేహితుడికి బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. డ్రైవర్‌కు ఒక కాలు విరగడంతో పాటు స్వల్ప గాయాలైనట్లు ఆయన తెలిపారు. వెంకటరాజు మృతదేహాన్ని చీరాల తరలించినట్లు ఎస్‌ఐ పవన్ మధు తెలిపారు.

శోకసంద్రంలో స్టూవర్టుపురం

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత
- లారీ కిందకు సగం దూసుకెళ్లిన కారు
- సీట్లలో ఇరుక్కుపోయిన మృతదేహాలు
- అరగంటపాటు శ్రమించి వెలికితీత
- డ్రైవర్ అతివేగమే దుర్ఘటనకు కారణం
- వైరల్ అవుతున్న సీసీ కెమెరా ఫుటేజ్
- మృతుల్లో ముగ్గురిది ఒకే కుటుంబం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బాధిత కుటుంబాల సభ్యులు
- స్టూవర్టుపురంలో విషాదఛాయలు



జేసీబీ సహాయంతో కారును వెనక్కు లాగిస్తున్న పోలీసులు

బాపట్ల టౌన్/కొమరోలు: ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అమరావతి – అనంతపురం జాతీయ రహదారిపై కొమరోలు మండలంలోని తాటిచెర్లమోటు సమీపంలో హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ కర్రెద్దుల దివాకర్ కారును అతివేగంగా నడపడంతో ఈ దుర్ఘటన జరిగింది. లారీని ఢీకొట్టిన తర్వాత కారు సగభాగం వరకు లారీ కిందకు దూసుకెళ్లింది. దీంతో కారు ముందు సీట్లలో కూర్చున్న డ్రైవర్ దివాకర్, పక్క సీటులో ఉన్న బొచ్చు సన్నీ మృతదేహాలు ఇరుక్కుపోయాయి. బయటకు తీసేందుకు జేసీబీ సహాయంతో అరగంటపాటు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. కారు వేగంగా వచ్చి లారీని ఢీకొట్టడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వినిపించినట్లు పెట్రోలు బంకులో ఉన్న వ్యక్తులు తెలిపారు. పెట్రోలు బంకులోని సీసీ కెమెరాలో ఈ ప్రమాదం రికార్డయింది. ఆ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కారులో ప్రయాణిస్తున్న బాపట్ల జిల్లా స్టూవర్టుపురం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో స్టువర్టుపురం గ్రామం, న్యూ గ్యాంగ్‌కు చెందిన గజ్జల నరసింహ (23), గజ్జల అంకాలు (45), పెద్ద గ్యాంగ్‌కు చెందిన గజ్జల జోసఫ్ అలియాస్ బబ్బులు (25), కర్రెద్దుల దివాకర్(24),లారో గ్యాంగ్‌కు చెందిన బొచ్చు సన్నీ (27), 1వ గ్యాంగ్‌కు చెందిన మొగిలి చిన్న భవాని (23) మృతి చెందారు. భవాని కుమారుడు సిద్దు, కుమార్తె సిరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలించారు. బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు ముందు భాగం

కుటుంబ కలహాలపై చర్చించేందుకు నంద్యాల జిల్లా డోన్‌లోని తమ బంధువుల ఇంటికి కారు ఆరుగురు వెళ్లారు. అక్కడ చర్చల అనంతరం మహానంది పుణ్యక్షేత్రాన్ని సందర్శించుకున్నారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

ఎటు చూసినా విషాదమే

బాపట్ల టౌన్: వ్యక్తిగత పనులపై డోన్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా ఆరుగురు తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటనతో స్టూవర్టుపురం శోకసంద్రంలో మునిగిపోయింది. ఒకే గ్రామానికి చెందిన ఆరుగురు ఒకేసారి మృత్యువు ఒడిలోకి జారుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో ఏ ఒక్కరిని పలకరించిన కన్నీరే సమాధానమైంది. గురువారం మధ్యాహ్నం చీరాల మండలం, తోటవారిపాలెం గ్రామంలోని పోలేరమ్మ దేవాలయంలో గజ్జల నరసింహ కుమారుడికి అన్నప్రాసన కార్యక్రమం జరిగింది. బాపట్ల జిల్లా, బాపట్ల మండలం, స్టూవర్టుపురం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు, ఇద్దరు చిన్నారులు కారులో వెళ్లారు. అనంతరం శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో వ్యక్తిగత పనులపై ఉమ్మడి కర్నూలు జిల్లా, ప్రస్తుత నంద్యాల జిల్లాలోని డోన్‌కు వెళ్లారు. కారులో తిరిగొస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, తాటిచెర్లమోటు గ్రామ సమీపంలోని అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. విషయం తెలిసిన మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికులు సైతం విషాదంలో మునిగిపోయారు.



మృతుడు కర్రెద్దుల దివాకర్ | మృతుడు గజ్జల జోసఫ్ అలియాస్ బబ్బులు | మృతుడు బొచ్చు సన్నీ | మృతురాలు గజ్జల అంకాలు | మృతుడు గజ్జల నరసింహ

కుటుంబంలో పెను విషాదం

గజ్జల అంకాలు, ఆమె కుమారుడు గజ్జల నరసింహ, కుమార్తె మొగిలి భవాని ఒకే సారి మృతి చెందడంలో కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది. అంకాలు భర్త జనార్దన్ ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందారు. వీరికి ముగ్గురు సంతానం. ప్రస్తుతం అంకాలు సహా వారి కుమారుడు నరసింహ, కుమార్తె భవానీ కూడా మృతి చెందారు. కుటుంబంలో కేవలం అంకాలు పెద్ద కుమారుడు వాసు మాత్రమే మిగిలారు. కుటుంబం మొత్తాన్ని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించిందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



విలపిస్తున్న నరసింహ భార్య జాబిల్లిని ఓదారుస్తున్న కుటుంబసభ్యులు

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

చిన్ననాటి నుంచి కలిసి తిరిగారు. ఎక్కడికైనా ఆ నలుగురు స్నేహితులు కలిసే వెళ్తారు. కుటుంబాలు వేరైనా ఓ తల్లి పిల్లల్లా కలిసిమెలసి తిరుగుతుంటారు. అలాంటి వీరి స్నేహాన్ని విధి వెక్కిరించింది. రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు వీరిని కబళించింది. ప్రాణ స్నేహితుల్ని విగత జీవులుగా మార్చింది. నాలుగు కుటుంబాలకు కడుపుకోత మిగిల్చింది. వీరిలో గజ్జల నరసింహకు మాత్రమే వివాహమైంది. గజ్జల జోసఫ్ అలియాస్ బబ్బులు ఆటోడ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దేవర దివాకర్, బొచ్చు సన్నీలకు వివాహం కాలేదు. వీరి కుటుంబాలకు వీరే మగదిక్కు. దీంతో వారి కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

లారీ ఢీకొని బాలుడి మృతి

తాడికొండ: లారీ ఢీకొని 12 సంవత్సరాల బాబు మృతి చెందిన ఘటన తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తుళ్లూరు గ్రామానికి చెందిన అంకం అభి (12) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాయపూడి పెట్రోల్ బంక్ వద్ద వేగంగా వస్తున్న లారీని ఢీకొట్టి బాలుడిని ఈడ్చుకు వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మైనర్ బాలుడు ద్విచక్ర వాహనం నడుపుకొని వెళుతుండటంతో ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైటాయించి న్యాయం చేయాలంటూ నిరసనకు దిగారు. రాత్రి 10 గంటల వరకు కూడా నిరసన ముగించక పోవడంతో పోలీసులు సర్ది చెప్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ వాహనం వదిలి పరారీలో ఉండటంతో పోలీసులు గాలిస్తున్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు, రాజధానిలో కూలీ పనులు లేకపోవడంతో గేదెలు మేపుకొని జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె కాగా కుమారుడి అకాల మరణంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. జరిగిన ఘటనపై తల్లిదండ్రులతో పాటు స్థానికులు అందరూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తుండటంతో ట్రాఫిక్ స్తంభించింది.



సీఆర్డీఏ గ్రీవెన్స్‌కు 38 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్

తాడికొండ: ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో తుళ్లూరులోని సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ డేకు ఈ వారం 38 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పాల్గొని లంక భూములు, అసైన్డ్ భూములు ఎన్ఎస్‌పీ పాలసీ పలు సమస్యలపై గ్రీవెన్స్‌లో సీఆర్డీయే అదనపు కమిషనర్ జి సూర్యసాయి ప్రవీణ్ చంద్‌కు వినతి పత్రాలు అందజేశారు. లంక అసైన్డ్ భూముల ఫిర్యాదులపై ప్రభుత్వాదేశానుసారం చర్యలు తీసకుంటామని ఆయన తెలియజేశారు. సీఆర్డీయేలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించి మిగిలినవి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అదనపు కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు. భూ సంబంధిత వ్యవహారాలకు సంబంధించి 33 ఫిర్యాదులు రాగా డెవలప్‌మెంట్ ప్రమోషన్ 2, సామాజిక సంక్షేమం 1, ల్యాండ్స్ సర్వే 1, ఇన్‌ఫ్రా 1 సమస్యలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.రవీందర్, ఎం శేషిరెడ్డి, కేఎస్ భాగ్యరేఖ, జి.భీమారావు, కె.స్వర్ణ మేరి, జీఆర్‌ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ, సీఆర్డీయే డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు పలువురు తహసీల్దార్‌లు, రైతులు పాల్గొన్నారు.

పేదరికం, అసమానతల మధ్య యువకుల జీవితాలు



ఏఎన్‌యూ: పేదరికం, అసమానతల మధ్య యువకుల జీవితాలు కొనసాగుతున్నాయని సెస్ (సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్) సంస్థ నిర్వహించిన 'యంగ్ లైవ్స్ స్టడీ' అంశాలు బహిర్గతం చేశాయి. హైదరాబాద్ సెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యంగ్ లైవ్స్ స్టడీ అంశాలను విడుదల చేశారు. కార్యక్రమానికి ఏపీ మహిళ, శిశు సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'యంగ్ లైవ్స్ స్టడీ' ద్వారా 2001–02 నుంచి హైదరాబాద్ సెస్ దీర్ఘకాలిక అంతర్జాతీయ పరిశోధన అధ్యయనాన్ని నిర్వహించడం అభినందనీయమని సూర్యకుమారి పేర్కొన్నారు. సెస్ డైరెక్టర్ ఈ రేవతి మాట్లాడుతూ బాల, బాలికల జీవితాల్లో మార్పులను అధ్యయనం చేసేందుకు ఈ స్టడీ దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, యూజీసీ కోఆర్డినేటర్ ఆచార్య వై అశోక్ కుమార్, పలువురు అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీ గ్రామీణ బ్యాంకుకు భూమి కేటాయించాలి

కొరిటిపాడు (గుంటూరు ఈస్ట్): రాష్ట్ర రాజధాని అమరావతిలో బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని స్థాపించేందుకు అవసరమైన భూమిని కేటాయించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించినట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె. ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఫైనాన్షియల్ ఇంక్లూషన్, గ్రామీణాభివృద్ధిని విస్తరించాలన్న బ్యాంకు దృష్టిని ప్రధాన కార్యదర్శికి వివరించినట్లు చెప్పారు. రాజధాని ప్రాంతంలో శాశ్వత ప్రధాన కార్యాలయాన్ని స్థాపించటం వల్ల బ్యాంకు పరిపాలనా సామర్థ్యాలు బలపడతాయని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామీణ ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలవుతుందని విన్నవించినట్లు తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. వీరితోపాటు హరీష్ బేతా తదితరులు ఉన్నారు.



కె.విజయానంద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి

జాతీయ క్రీడకు గ్రహణం

ఒలింపిక్స్‌లో వరుసగా బంగారు పతకాలు సాధించిన క్రీడ. ప్రపంచం మెచ్చిన ధ్యాన్‌చంద్‌లాంటి అద్భుత క్రీడాకారులను అందించిన క్రీడ. ఘన చరిత్రను సొంతం చేసుకోవడంతోపాటు జాతీయ క్రీడ హోదాను దక్కించుకున్న హాకీకి జిల్లాలో చోటులేకుండా పోయింది.

- వేసవి శిక్షణలో కూడా లేని హాకీ
- కనీస మైదానం లేక అవస్థలు
- పట్టించుకోని నాయకులు, అధికారులు
- ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న క్రీడాకారులు



గతంలో బీఆర్ స్టేడియంలో జరిగిన జాతీయ హాకీ పోటీల దృశ్యం (ఫైల్)

గుంటూరు వెస్ట్ (క్రీడలు): దశాబ్దకాలం నుంచి జిల్లాలో హాకీకి క్రీడా మైదానం లేదు. గుంటూరు నగరంలో సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బీఆర్ స్టేడియంలో కూడా హాకీకి చోటుక ల్పించకపోవడం దారుణమని సీనియర్ క్రీడాకారులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం వేసవి శిక్షణ శిబిరాలు జిల్లా వ్యాప్తంగా నడుస్తున్నాయి. దాదాపు 20 క్రీడల్లో చిన్నారులు ఉత్సాహంగా శిక్షణ తీసుకుంటున్నారు. అయితే ఇందులో హాకీ లేకపోవడం గమనార్హం. హాకీ సీనియర్ క్రీడాకారులు పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులను, జిల్లా కలెక్టర్లను కలిసినా ఫలితం శూన్యం. ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం తమ పిల్లలకు సొంతంగా హాకీ టర్ఫ్‌ను ఏర్పాటు చేసుకుంది. జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారులు కనీసం ఆ దిశగా చర్యలు కూడా తీసుకోకపోవడం ఏంటని కొందరు క్రీడా సంఘ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన క్రీడా పాలసీ ఏమయ్యిందో ఎవరికీ తెలీయదు.




గతంలో వేసవి శిక్షణ శిబిరంలో సాధన చేస్తున్న చిన్నారులు (ఫైల్)

3 ఎకరాలు సరిపోతుంది

హాకీ మైదానం కావాలంటే కనీసం మూడు ఎకరాలుంటే సరిపోయేది. పాలకులు మాత్రం కనీస చొరవ చూపడంలేదు. ప్రస్తుతం నగరంలో క్రీడాకారులు బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లో గంటకు రూ.1000 చెల్లించి సాధన చేస్తున్నారు. దీంతోపాటు కొన్ని కళాశాలల్లో ఖాళీ స్థలాలను తీసుకుని వారే బాగు చేసుకుని సాధన చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 50 నుంచి 75 మంది వరకు రాష్ట్ర, జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులున్నారు. ప్రస్తుతం కొందరు జాతీయ సీనియర్ నేషనల్స్ ఆడుతున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. దీనిలో ఒక ఎంపీ, జిల్లా కలెక్టర్ కలిసి కొంచెం పనిచేస్తే హాకీ టర్ఫ్ వికెట్‌కు రూ.8 కోట్లు కేటాయిస్తుంది.


చాలా ప్రయత్నాలు చేస్తున్నాం



నేను భారత హాకీ జట్టు క్యాంపులో సాధన చేశాను. అంతర్జాతీయ రిఫరీగా పనిచేస్తున్నాను. జిల్లాలో హాకీకి గ్రహణం పట్టిందా అనిపిస్తుంది. ఎవర్ని అడిగినా చేద్దామంటారేగాని ముందుకు రారు. ప్రస్తుతం కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ క్రీడలపట్ల చొరవ చూపిస్తున్నారు. ఆయనను కలిసి వివరిస్తాను. జాతీయ క్రీడలకు కనీసం మైదానం లేకపోవడమంటే ఇది అవమానమే. గ్రౌండ్ ఇస్తే చాలు మా అసోసియేషన్ నుంచి క్రీడాకారులను, కిట్స్‌ను ఇతర అంశాలకు పూర్తి సహకారమందిస్తాం. మైదానం ఏర్పాటు చేసి, ఒక శాప్ హాకీ కోచ్‌ను ఇవ్వండి. కేవలం రెండు సంవత్సరాలు చూడండి ఎన్ని రిజల్ట్స్ గుంటూరు జిల్లాకు వస్తాయో. హాకీలో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందే వీలుంటుంది.

– జి.హర్షవర్ధన్, ప్రధాన కార్యదర్శి హాకీ,


క్రీడాభివృద్ధి ఎలా ...



కేవలం ప్రభుత్వ పాలసీలతో క్రీడాకారులు కాలేరు. క్షేత్ర స్థాయిలో మైదానం, శిక్షకులు ఉండాలి. మనకు రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తున్నారు. క్రీడా మైదానాలు కూడా అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నాను. నేను సీనియర్ నేషనల్స్ ఆడుతున్నాను. ప్రతి రోజూ గుంటూరులో అటు ఇటు కలిపి 30 కి.మీ వెళ్ళి సాధన చేయాల్సి వస్తుంది. దయచేసి మైదానం ఏర్పాటు చేయండి.

– సయ్యద్ ఖాశిం ఆలి, సీనియర్స్ హాకీ నేషనల్స్ క్రీడాకారుడు.

ఈ క్రీడకు ఎవరు



మన జిల్లా నుంచి ఎందరో భారత హాకీ జట్టులో ఆడారు. దేశవ్యాప్తంగా రాష్ట్ర హాకీ జట్టుకు మంచి పేరుంది. గుంటూరు జిల్లాలో మైదానాలు లేకపోవడం, ప్రభుత్వం నుంచి హాకీకి ఆదరణ లేకపోవడంతో క్రీడా సాధనకు చిన్నారులు రాకపోవడం తగ్గించారు. అసోసియేషన్ తరఫున ఎన్నో ప్రయత్నాలు చేశాం. ఫలితం లేకుండా పోయింది.

– ఎస్.క్రాంతి కుమార్, హాకీ క్రీడాకారుడు.